సాక్షి వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 9 । జనవరి । 2024



మల్చింగ్‌తో.. మస్తు దిగుబడి

ఉద్యాన సాగులో మల్చింగ్‌తో అధిక దిగుబడులు పొందొచ్చని అధికారులు సూచిస్తున్నారు. సాగునీరు ఆదా అవుతుందని చెబుతున్నారు. - 8లో



జాతీయ స్థాయిలో చర్చ జరిగేలా క్రీడా పోటీలు

దేశవ్యాప్తంగా చర్చించుకునేలా జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడి అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.9 /21.6

జిల్లాలో సోమవారం 23.2 - 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వివిధ స్థాయీ సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొంటారని తెలిపారు. కనుక జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

13న కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 13వ తేదీ ఉదయం జిల్లా స్థాయి కబడ్డీ బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు జనవరి 20 నుంచి 23వ తేదీ వరకు నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 6304309294, 9949304160 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త 5, సహాయకురాలు 21, మినీ అంగన్వాడీ కార్యకర్త 4 పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. అర్హులైన వారు తమ పూర్తి బయోడేటా, అర్హతలకు సంబంధించిన ధృవపత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించి ఈనెల 11వ తేదీలోగా తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆయా పోస్టులకు సంబంధించి ఈ నెల 20వ తేదీన కడపలోని ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలుంటాయన్నారు.

మైనారిటీలకు గ్రూప్-2లో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి మైనారిటీ వర్గాలకు గ్రూప్-2 శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్, ఇస్లాం, సిక్కు, జైన్, బుద్దిస్ట్, పార్సీలలో అర్హులైన వారు ఈ నెల 9వ తేదీలోగా తమను సంప్రదించాలన్నారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడు పల్లకీలో ఊరేగాడు. సోమవారం రాత్రి ఆలయంలో మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.ఉత్సవ మూర్తులను ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణస్వామి, చంద్రశేఖర్ స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీలో కొలువు దీర్చారు.ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఖాళీగా ఉన్న 267 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో 13 కేటగిరీలకు 65 ఖాళీలు, ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రిలో 29 కేటగిరీలకు 202 పోస్టులున్నాయన్నారు. వీటికి సంబంధించి జనవరి 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు చిత్తూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేటగిరీ, అర్హత, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లోనే ఉంచామన్నారు.

అన్నమయ్య జిల్లాలో వర్షం

రాయచోటి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అన్నమయ్య జిల్లా లో సోమవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి వర్షం కురుస్తోంది. వర్షం రాకతో చలి పెరిగింది. జిల్లా ప్రజలు చలితో వణికిపోతున్నారు.మరో 5 రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.దీంతో మామిడి రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులు, సిబ్బందిని జేసీ ఆదేశించారు.

ఉవ్వెత్తున ఎగసిన
సామాజిక ఉత్తేజం



బస్సుయాత్రలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, తదితరులు

- బద్వేలులో కదం తొక్కిన బడుగులు
- జనసంద్రంగా మారిన పుర వీధులు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన సభా ప్రాంగణం
- ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ముస్లింమైనార్టీలు



బద్వేలు జరిగిన సామాజిక సాధికార యాత్రలో భారీ జన సందోహం

సాక్షి ప్రతినిధి, కడప : బద్వేలు పట్టణంలో జ(గ)నభేరీ మోగింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన బడుగులు కదం తొక్కారు. నాలుగేళ్లలో మారు నిర్వహించే బద్వేల్ జాతరను మరిపించేలా ప్రజానీకం బారులు తీరారు. సిద్ధవటం రోడ్డులోని చర్చి సమీపం నుంచి ప్రారంభమైన ర్యాలీ కిలోమీటరు పొడవునా సాగింది. డప్పు వాయిద్యాలు, బాణా సంచా పేలుళ్లు, జానపద కళాకారుల నృత్యాలతో వైభవంగా నిర్వహించారు. బస్టాండు సమీపంలో మసీదు దగ్గరకు ర్యాలీ చేరుకోగానే ముస్లిం మైనార్టీలు ప్లకార్డులు చేతబట్టుకుని క్రమశిక్షణతో ర్యాలీలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారు. అండగా ఉంటున్న ప్రభుత్వానికి సంఘీభావంగా ముస్లిం మహిళలు భారీ స్థాయిలో పాల్గొన్నారు. బస్సుపై నుంచి బద్వేల్ నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వివరిస్తుండగా, జనం జేజేలు పలుకుతూ ర్యాలీ కొనసాగించారు. పేదల జీవితాలు మార్చాలనే సంకల్పంతో నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా 1,38,763 మంది లబ్ధిదారులకు రూ.1268.73కోట్ల నగదు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ చేశారన్నారని వివరిస్తుండగా.. మనుసున్న నాయకుడంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజానీకం కేరింతలు కొట్టారు.

తాగునీటికి శాశ్వత పరిష్కారం.. ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పన...

పట్టణంలో ఏళ్ల తరబడి తాగునీటికి దుర్భరమైన పరిస్థితులుండేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.50కోట్లతో బ్రహ్మంసాగర్ ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రూ.1000 కోట్లతో సెంచరీ ప్యానల్స్ పరిశ్రమ నెలకొల్పి ఇటీవలే ప్రారంభించారు. తద్వారా బద్వేలు నియోజకవర్గంలోని వేలాది మంది యువకులకు ఉద్యోగాలు దక్కాయి. రూ.2కోట్లతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు, అర్బన్ హెల్త్ సెంటర్లు తదితర మౌలిక వసతులు సమకూర్చిన నేపథ్యం గురించి నాయకులు చెబుతుంటే జనం జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు. బద్వేలు ముస్లిం మైనార్టీల కమ్యూనిటీ భవనం నిర్మాణానికి విలువైన స్థలం అప్పగించేందుకు శ్రీకారం చుట్టడంతో ముస్లిం మహిళలు, యువకులు పెద్ద ఎత్తున సంఘీభావం ప్రకటించారు. పట్టణంలోని మసీదు ప్రాంగణం నుంచి వందలాది మంది ప్లకార్డులు చేతబూని ర్యాలీలోకి ప్రవేశిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



ర్యాలీలో బ్యాండ్‌మేళం కళాకారుల ప్రదర్శన



ర్యాలీలో సంఘీభావంగా పాల్గొన్న ముస్లిం మహిళలు, చిన్నారులు

బడుగులకు అగ్రపీఠం వేశారు



జగనన్న పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉప ముఖ్యమంత్రులు అప్పగించారు. ఎస్సీ మహిళకు హోంమంత్రిత్వశాఖ కట్టబెట్టారు. ఎన్నో కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేటాయించారు. సామాజిక న్యాయం అంటే ఏమిటో చూపించారు. స్వతహాగా వైద్యురాలినైన నేను ప్రభుత్వ వైద్యసేవలను కళ్లరా చూస్తున్నా. మునుపెన్నడూ చేయని రీతిలో సామాన్యుడికి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలి. మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలి.

- డాక్టర్ సుధ, ఎమ్మెల్యే, బద్వేలు

ఆచరణలో చూపెట్టిన సీఎం



భారతదేశంలో సామాజిక సాధికారత ఆచరణలో చూపెట్టిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. బీసీలను బ్యాక్‌బోన్‌క్లాస్‌గా అభివర్ణించి అందుకు తగ్గట్టుగానే నిర్ణయాలు తీసుకున్నారు. తన కేబినేట్‌లో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్థానం కల్పించిన గొప్ప నాయకులు.యాదవ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పించారు. రాజ్యాధికారాన్ని ఇంతటి సమపాళ్లలో అందించిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదారించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకతాటి పైకి వచ్చి వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి.

- రమేష్‌యాదవ్, ఎమ్మెల్సీ

అర్జీలను సత్వరం పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : 'స్పందన'కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన'కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీతోపాటు డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర లక్ష్యాన్ని అధిగమించాలి

క్షేత్ర స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల లక్ష్యాన్ని అధిగమించాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ఆసక్తితోపాటు ప్రజల్లో మానసిక నైపుణ్యాన్ని పెంచేందుకు అన్ని వయస్సులవారి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. బాధ్యతగా విధులను నిర్వర్తించాలని సూచించారు. ఇప్పటివరకు నిర్వహించిన క్రీడల నివేదికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం విధులు కేటాయించిన అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

వైఎస్ జగన్‌తోనే సామాజిక సాధికారత

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

బద్వేలు అర్బన్ : గతంలో సామాజిక సాధికారత ఒక నినాదంగా మాత్రమే ఉండేది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సామాజిక సాధికారతను అమలు చేసి ఒక విధానంగా మార్చారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా సోమవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బంగారుశీనయ్య ఇంటి ఆవరణలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల తలరాతలు మారాలంటే వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మిగిలిన వర్గాలకు సేవ చేసేందుకు మాత్రమే పరిమితమై ఉండేవారన్నారు. అప్పట్లో కొంత మంది ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ వారికి పూర్తిస్థాయిలో స్వేచ్ఛ, అధికారం అందలేదన్నారు. ప్రస్తుతం రోజులు మారాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారు. దీంతో ఆయా వర్గాలకు చెందిన ప్రజలు జగనన్నను దేవుడిగా ఆరాధిస్తున్నారు. మాట తప్పని కులం, మడమతిప్పని మతం జగనన్నది అని అన్నారు. విద్య పేదల తలరాతను మారుస్తుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిఅమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, ఇసాక్‌బాష, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెలఝాన్సీ, సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగాపెంటరమణమ్మ, హస్తకళల కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సహకార మేనేజ్‌మెంట్ సంస్థ ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాస్

కడప అగ్రికల్చర్ : గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని అందుకు ప్రభుత్వం అనేక రకాల చర్యలు చేపడుతోందని సహకార మేనేజ్‌మెంట్ సంస్థ ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమణారెడ్డి ఆధ్యక్షతన మంగళవారం ఊటుకూరులోని జిల్లా గొర్రెల అభివృద్ధి కార్యాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలను లాభాల బాటలోకి తీసుకురావడానికి వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక స్వావలంబనకు పాలకవర్గం, సిబ్బంది కృషి చేయాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం చైర్మన్ అన్నెం నాగమల్లేశ్వరయ్య మాట్లాడుతూ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలన్నారు. జిల్లా గొర్రెల పెంపకదారుల సహకారం సంగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 134 యాక్టివ్ సొసైటీలు ఉన్నాయన్నారు. సొసైటీల అభివృద్ధికి తీసుకోవాలని చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్, సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

భారీస్కోరు సాధించిన ఆంధ్రా జట్టు

- డబుల్ సెంచరీ సాధించిన రేవంత్
- హేమంత్, దత్తారెడ్డి సెంచరీలు

కడప స్పోర్ట్స్ : కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో ఆంధ్రా జట్టు భారీస్కోరు సాధించింది. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో రెండోరోజు సోమవారం 404 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 124 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 606 పరుగులు చేసింది. జట్టులోని కె. రేవంత్‌రెడ్డి 373 బంతుల్లో 25 ఫోర్లతో 220 పరుగులు చేశాడు. ఎం. హేమంత్‌రెడ్డి 123 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సర్‌లతో 121 పరుగులు చేశాడు. ఎం.కె. దత్తారెడ్డి 86 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్‌లతో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గోవా బౌలర్లు మనీష్ 2, శుభంతరి 1, రాహుల్ మెహతా 1 వికెట్ తీశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.



హేమంత్‌రెడ్డి (123 పరుగులు)



రేవంత్‌రెడ్డి (220 పరుగులు)



దత్తారెడ్డి (102 పరుగులు)

సైన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థితో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : అగస్త్య ఫౌండేషన్ కుప్పం వారి ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు జిజ్ఞాస ఇన్నోవేటివ్ సైన్స్ కాంపిటీషన్ పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో రెండు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా ఇందులో నుంచి 206 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వీటిని పరిశీలించి ఇందులో నుంచి 46 ప్రాజెక్టులను రెండు రాష్ట్రాల నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వైఎస్సార్‌జిల్లా నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఇలియాస్, అమృతనాయుడు కలిసి రూపొందించిన కూలింగ్ హెల్మెట్ ప్రాజెక్టు రెండు రాష్ట్రాల నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమలనాథశర్మను జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డిలు అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన 46 ప్రాజెక్టుల విద్యార్థులకు జనవరి 9,10 తేదీల్లో వర్చువల్‌గా కాంపిటీషన్ నిర్వహించనున్నారు.వీరిలో ముగ్గురి ప్రాజెక్టులను జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు.

11న జాబ్ మేళా

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈనెల 11వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడ్‌ప్లస్ ఫార్మసీలో ఫార్మసిస్టులుగా, డిక్సన్ టెక్నాలజీ కంపెనీలో అసెంబ్లీ లైన్ ఆపరేటర్‌గా పనిచేయడానికి పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఫార్మసీ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్హతలు కలిగిన, 19 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సుగల అభ్యర్థులు అర్హులన్నారు. ఇందులో ఎంపికైన వారికి నెలకు రూ. 11076 నుంచి 18 వేలు వరకు హోదానుబట్టి జీతం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల మహిళా, పురుష అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోలు తీసుకొని ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి


బసిరెడ్డి (ఫైల్)

మైదుకూరు : మైదుకూరు పట్టణ శివారులో సోమవారం సాయంత్రం లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ బండి కుంటిమ్మగారి బసిరెడ్డి (58) మృతి చెందాడు. పట్టణంలోని వినాయక నగర్‌కు చెందిన గొగ్గి ఓబయ్య అనే రైతుకు చెందిన పొలానికి నీరు పారగట్టే పైపులను చాపాడు మండలం చియ్యపాడు నుంచి ఆటోలో వేసుకుని వస్తుండగా స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని కల్యాణ మండపం వద్ద లారీ ఢీకొట్టినట్టు తెలుస్తోంది. సంఘటనలో ఆటో నడుపుతున్న బసిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న రైతు ఓబయ్య కూడా గాయపడ్డాడు. వీరిద్దరినీ మైదుకూరులోని ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు ప్రయత్నిస్తుండగా బసిరెడ్డి మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. బసిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఒంటిమిట్టలో ఆగని దొంగతనాలు


చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మధుసూదన్ రావు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట జెడ్పీహైస్కూలు సమీపంలోని దుకాణాలలో ఆదివారం అర్ధరాత్రి మళ్లీ దుండగులు దొంగతనాలకు తెగబడ్డారు. బాధితుల సమాచారం మేరకు...ఒంటిమిట్ట జెడ్పీ హైస్కూలు సమీపంలోని వెస్ట్రన్ యూనియన్, వస్త్ర దుకాణాలు, వాటికి ఎదురుగా ఉన్న ప్రదీప్ ఎలక్ట్రికల్స్ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి ముఖ ద్వారానికి వేసిన తాళాలను పగుల గొట్టి చోరీ చేశారు. ఇందులో వెస్ట్రన్ యూనియన్ దుకాణంలోని రూ. 10వేలు విలువ చేసే కొత్త సెల్ ఫోన్ చార్జర్లు, ఇయర్ ఫోన్స్, గ్యాస్ స్టవ్ సామాను, వస్త్ర దుకాణంలోని రూ. 20 వేలు విలువ చేసే దుస్తులను, ప్రదీప్ ఎలక్ట్రికల్స్‌లోని క్యాష్ కౌంటర్‌లోని దాదాపు రూ.8 వేలు నగదును ఎత్తుకెళ్లారు. రోజులాగానే సోమవారం ఉదయం దుకాణాలు తెరిచేందుకు వచ్చిన వారు దుకాణం తలుపులు తెరిచి ఉండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు సంఘటన స్థలాలను పరిశీలించారు. మండల కేంద్రంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మల్చింగ్‌తో.. మస్తు దిగుబడి

- సాధారణం కంటే 30శాతం అదనం
- ఆసక్తి చూపుతున్న రైతాంగం
- సాగునీరు ఆదా, కలుపు మొక్కల బెడద తగ్గించుకోవచ్చు


రాయచోటి నియోజకవర్గం పరిధిలో మల్చింగ్ విధానంతో సాగుచేసిన మిరప పంట

రాయచోటి : ఉద్యాన సాగులో మల్చింగ్ విధానం రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతోంది. ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడిని పొందేందుకు ఇది మంచి విధానమని అధికారులు పేర్కొంటున్నారు. అధికారుల సలహాలు, సూచనల ఆధారంగా పంటలు సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రైతులకు కలిసొచ్చే అవకాశం..

ఉద్యానసాగులో మల్చింగ్‌తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పరిధిలో పంటలను సాగుచేసే రైతులు అధికారుల సలహాలు, సూచనల మేరకు మల్చింగ్ పద్ధతిని ఎంచుకుంటున్నారు. దీనివల్ల రైతులకు కలుపు నివారణ మందులు చల్లడం, కలుపు తీయడం వంటి ఎలాంటి ఖర్చులుండవు. ఒక ఎకరంలో మల్చింగ్ పద్ధతిలో పంటలను సాగుచేసేందుకు సుమారు రూ. 12 వేల వరకు ఖర్చు అవుతుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఆ తరువాత విత్తనాలు విత్తిన నాటి నుంచి పూర్తిగా పంట ఎండిపోయే వరకు ఎలాంటి కలుపు నివారణ పనులు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో సాగు చేసిన రైతులకు కలిసివచ్చే అవకాశం ఉందని వివరిస్తున్నారు. రైతులు మామూలుగా పండించే పంటల కంటే మల్చింగ్ పద్ధతిలో 30శాతం అధికంగా సాగు చేసుకోవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

సాగు విధానం..

ఈ పద్ధతిలో 25, 60, 50,75, 100 మైక్రాన్ల మందం కల్గిన ప్లాస్టిక్ షీట్‌ను పూలు, పండ్లతోటలతోపాటు కూరగాయల మొక్కల పారలు బోదెలపై కప్పి ఉంచాలని సూచించారు. పండ్ల తోటలకు 75 నుంచి 100 మైక్రాన్లు, పూలు, పండ్ల తోటలు ఇతర స్వల్పకాలిక పంటలకు 25, 30, 50 మైక్రాన్ల షీట్లను వినియోగిస్తారన్నారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు హెక్టారుకు రూ. 35 వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. పంటలను సాగు చేసుకునేందుకు రైతు పొలం చదును చేసిన తరువాత విత్తనాలు విత్తే సమయంలో మల్చింగ్ కవర్‌ను తీసుకొని ముందుగా పొలంలో ప్రతి మల్చింగ్ కవర్‌కు నాలుగు అడుగుల దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. తరువాత డ్రిప్ ద్వారా పంటలకు నీరు చేరే సమయంలో విత్తనాన్ని విత్తే ప్రదేశంలో మల్చింగ్ కవర్‌కు చిన్న రంధ్రం ఏర్పాటు చేసి అందులో విత్తనానికి విత్తనానికి మధ్య సుమారు 60 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తాలన్నారు. ఇలా ఏర్పాటు చేసిన మల్చింగ్ కవర్ ద్వారా సుమారు మూడుసార్లు అదే ప్రదేశంలో విత్తనాన్ని విత్తుకొని పంటలను సాగు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు తెలియజేస్తున్నారు.

ప్రయోజనాలు..

30 నుంచి 80 శాతం సాగుకు నీరు ఆదా అవుతుంది. 70 నుంచి 90 శాతం కలుపు మొక్కల బెడద తగ్గించుకోవచ్చు. ఎరువులు వృథా కాకుండా సమర్థవంతంగా మొక్కలకు అందుతుంది. వ్యవసాయ కూలీల ఖర్చు తగ్గుతుంది. వేరు భాగంలో అనుకూలమైన వాతావరణం పెంచి వేరు వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుంది. వర్షాకాలంలో మట్టి కొట్టుకుపోకుండా కాపాడుతుంది. విత్తనం మొలకెత్తేందుకు అనుకూలమైన వాతావరణం పెంచుతుంది.

అవినీతి జరిగిందని నిరూపిస్తే పదవికి రాజీనామా

వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి



వేంపల్లె : వేంపల్లె మండల వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి పనులలో అవినీతి జరిగిందని నిరూపిస్తే తన జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయడంతో పాటు రాజకీయ సన్యాసం తీసుకుంటానని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం రాత్రి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుడు బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. గిడ్డంగివారిపల్లె మినీ రిజర్వాయర్ (చెరువు) పనులలో రూ.100కోట్ల అవినీతి జరిగిందని బీటెక్ రవి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటివరకు రిజర్వాయర్ పనులు సుమారు రూ.70కోట్ల మేర జరిగాయన్నారు. మిగిలిన పనులు అటవీ శాఖ నుంచి క్లియరెన్స్ రాక ఆ పనులు నిలిచిపోయినట్లు వెల్లడించారు. అయితే బీటెక్ రవి వేంపల్లెకు వచ్చిన ప్రతిసారి అదేపనిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తనపైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇది అతని రాజకీయ ఉనికి కోసం చేస్తున్నారని చెప్పారు. అలాగే గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై విచారణ జరిపితే ఎవరి పాలనలో నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు జరిగాయో తెలుస్తుందన్నారు. వేంపల్లె మండల పరిధిలో గత 14ఏళ్ల టీడీపీ పాలన, దివంగత సీఎం వైఎస్సార్ 5ఏళ్ల పాలన, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

మూడో విడతలో 84 మందికి మీడియా అక్రిడిటేషన్లు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు 2023–24 సంవత్సరానికి మూడో విడతలో 84 మందికి మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన 2023 – 24 సంవత్సరానికి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరుపై జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మూడవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క అక్రిడిటేషన్ దరఖాస్తును కూడా తిరస్కరించలేదన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్ని నిబంధనలు పూర్తిచేసిన వారికి మూడవ విడతలో 84 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు మంజూరు చేశామన్నారు. అక్రిడిటేషన్ మంజూరు కానివారు రాష్ట్ర సమాచార శాఖ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లను పొందుపరిచి సదరు కాపీలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి, డివిజనల్ పీఆర్‌ఓ సునీల్ సాగర్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు



నాడు–నేడు పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలే మార్చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేల కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు మెరుగు పరిచారు. కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. సాంకేతికతతో తయారు చేసిన బోర్డులు ఏర్పాటు చేయడంతో పాఠాలు చెప్పడంలోనూ, విద్యార్థులు చదువుకోవడం లోనూ శ్రద్ధ పెరిగింది. మెరుగు పడిన సౌకర్యాలతో గతం కంటే మంచి ఫలితాలు సాధిస్తున్నాం. ముఖ్యంగా మెనూ కూడా మార్చడంతో విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందుతోంది. తద్వారా విద్యార్థుల సంఖ్య పెరిగింది. కొత్త విధానాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై నమ్మకం మరింత పెరిగింది.

– ఎన్‌వీ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, సి.రాజుపాళెం ఎంపీపీ స్కూల్, కమలాపురం

సొంత ఇంటిని నిర్మించుకున్నా



గతంలో మేము మట్టి మిద్దెలో ఉండేవాళ్లం. వర్షం వస్తే ఉరుస్తుండటంతో చాలా ఇబ్బందులు పడేవారం. సొంత ఇంటి కోసం గత ప్రభుత్వంలో ఎన్ని మార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వంలో ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్నాను. మా వలంటీర్ ఇల్లు మంజూరైందని తెలపడంతో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాం. త్వరగా పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం బిల్లులను వెంటనే మంజూరు చేసింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– ఏరాసి రామలింగమ్మ, గాదెగూడూరు గ్రామం, రాజుపాళెం మండలం

జగనన్న సురక్ష ద్వారా ఊరిలోనే కుల ధ్రువీకరణ పత్రం



నాలుగు నెలల క్రితం మా ఊర్లోని గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మీటింగ్ పెట్టారు. ఈ మీటింగ్‌లో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఈ మీటింగ్‌కు ముందు మా ఇంటికి వలంటీరు వచ్చి నా ఆధార్ కార్డు చూసి వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం కావాలని చెప్పారు. ఆ తర్వాత నయా పైసా ఖర్చు కాకుండానే సచివాలయం వద్ద ఉచితంగా సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో చేయూత పథకానికి దరఖాస్తు చేసుకున్నాను.

– శ్రీపతి వరకుమారి, అన్నవరం, చాపాడు మండలం

జాతీయ స్థాయిలో చర్చ జరిగేలా క్రీడా పోటీలు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : దేశవ్యాప్తంగా రాజంపేట గురించి చర్చించుకునేలా జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు అధికారులు, ఇతరులు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సూచించారు. ఈనెల 28వ తేదీ నుంచి రాజంపేటలో జరగనున్న 67వ జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీల నిర్వహణపై సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో పలు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. దేశం నలు మూలల నుంచి వందలాది మంది క్రీడాకారులతో పాటు అధికారులు కూడా ఈ పోటీల కోసం విచ్చేస్తారన్నారు. వారంతా తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లి రాజంపేట గురించి వారి ప్రాంతంలోని వారికి గొప్పగా చెప్పుకునేలా పోటీల నిర్వహణ, ఆతిథ్యం ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకోసం తనవంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు, అధికారులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. నార్త్ ఇండియా, సౌత్ ఇండియా ప్రాంతాలకు చెందిన వారి ఆహారపు అలవాట్లు వేర్వేరుగా ఉంటాయని, అందుకు తగ్గట్లు ఆహార పదార్థాలు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేది బాలికలు అయినందున వారి భద్రత విషయంలో అధికారులు పోలీసుశాఖ సహకారం తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున క్రీడాకారులందరికి పరుపులు, బెడ్‌షీట్లు విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్డీఓ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. ప్రతి కమిటీ వారికి అప్పజెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోటీల ప్రారంభానికి రెండు రోజుల ముందే ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. అందుకు తగ్గట్లు ప్రణాళికలను రూపొందించుకోవాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పలుమార్లు రాజంపేటలో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలను విజయవంతం చేసిన అనుభవం ఇక్కడి అధికారులకు ఉందని, అందువల్ల ఈ పోటీలను కూడా అదే తరహాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్రీడా పోటీలకు మున్సిపల్‌శాఖ తరపున పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామన్నారు. అలాగే వ్యక్తిగతంగా కూడా సంపూర్ణ సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం డీఈఓ పురుషోత్తం, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఆర్‌ఐపీ, స్కూల్‌గేమ్స్ రాష్ట్ర సెక్రెటరీ జి.భానుమూర్తిరాజు, డిప్యూటీ డీఈఓ వరలక్ష్మీ, స్కూల్‌గేమ్స్ జిల్లా సెక్రెటరి వసంత తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు మారడం సీఆర్‌సీకి అలవాటే

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : పార్టీలు మారడం, పదవుల కోసం పొగడ్తలు కురిపించడం ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యకు అలవాటేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్‌బాబు విమర్శించారు. సోమవారం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ఎన్టీఆర్ 1992లో సీఆర్‌సీకి 20 సూత్రాల అమలు మంత్రి పదవి ఇచ్చారని, 1989లో ఓడిపోతాడని తెలిసి కూడా పార్టీ టికెట్ ఇచ్చారన్నారు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు ఆయన ప్రజారాజ్యం పార్టీలో చేరి చిరంజీవికి సలహాలు, సూచనలు ఇస్తానని నమ్మబలికి ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయించి మంత్రి పదవి తీసుకున్నారన్నారు. 2014లో మళ్లీ టీడీపీలో చేరి చంద్రబాబును పొగిడారని, 2019లో ఎన్నికలకు రెండు నెలల ముందు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరి చంద్రబాబు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడు, లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశాడని విమర్శలు చేశారని గుర్తు చేశారు. సి.రామచంద్రయ్య సీనియర్ నాయకుడు, మేధావి అని భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చి గౌరవించారన్నారు. కోస్తాలో కాపులకు ఎక్కువ సీట్లు ఇచ్చినా చిత్తూరు, కనిగిరి, కడప జిల్లాలో మూడు సీట్లు కాపులకు ఇచ్చారన్నారు. తాజాగా వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ కండువా కప్పుకున్న రామచంద్రయ్య రాష్ట్రానికి రూ.12 లక్షల కోట్ల అప్పు అయిందని, పాలన అస్తవ్యస్తమైందని విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇది చంద్రబాబుకు ముళ్ల కిరీటమేనని ఆయన పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. 2019కి ముందు వైఎస్సార్‌సీపీలో చేరుతూ చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడని మాట్లాడిన అదే నోటితో నేడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికీ రామచంద్రయ్య ఐదు పార్టీలు మారారని, ఏ పార్టీలో చేరితే ఆ పార్టీ అధినేతలను పొగడటం, పదవులు పొందడం ఆయనకు వెన్నెతో పెట్టిన విద్య అన్నారు. ఇలాంటి నీతి బాహ్యమైన చర్యలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందనే కారణంతోనే సీఆర్‌సీ పార్టీ మారాడని, ఆయన కలలు ఎన్నటికీ నెరవేరవన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. సీఆర్‌సీకి నీతి, నిజాయితీ, ఏ మాత్రం విలువలు ఉన్నా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్.యానాదయ్య, ప్రభుత్వ ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, శంకరాపురం సింధు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బుగ్గవంక ప్రాజెక్టులో ఈతకు వెళ్లి యువకుడి మృతి


బంకి మధు (ఫైల్)


బుగ్గవంక ప్రాజెక్టు నీటిలో తేలియాడుతున్న మృతదేహం

చింతకొమ్మదిన్నె : కడప నగరంలోని బాలాజీ నగర్‌కు చెందిన బంకి మధు(18) అనే యువకుడు ఈనెల 5వ తేదీ బుగ్గ వంక ప్రాజెక్టులో ఈతకు వెళ్లి మృతి చెందినట్లు సీకేదిన్నె ఎస్‌ఐ బి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు బంకి మధు తన తోటి స్నేహితులైన చరణ్, నరసింహులతో కలిసి బుగ్గవంక ప్రాజెక్టుకు వెళుతున్నానని ఇంటిలో చెప్పాడు. ప్రాజెక్టుకు వెళ్లిన వీరు ఈత కొట్టేందుకు డ్యాంలో దిగగా బంకి మధు గల్లంతు అయ్యాడు. చరణ్, నరసింహులు కాపాడేందుకు ప్రయత్నం చేయగా వీలుకాలేదు. దీంతో భయపడి పారిపోయారు. మృతుడి నాన్నమ్మ ఈశ్వరమ్మ తన మనవడు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆరోజు రాత్రి వరకు బుగ్గ వంక ప్రాజెక్టు పరిసరాలలో వెతికినప్పటికీ ప్రయోజనం లేదు. ఆమె సీకే దిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో 7వ తేదీ సాయంత్రం మొదటి గేటు వద్ద వాచ్‌మెన్ నాగేంద్రకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. 8వ తేదీ సోమవారం ఉదయం ఫిర్యాది ఈశ్వరమ్మతో పాటు పోలీసులు ప్రాజెక్టు వద్దకు వెళ్లి మృతదేహాన్ని వెలికితీయగా మధుదిగా గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్ట్‌లు, బ్యాడ్జీల సరఫరా కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప అర్బన్ : కడపలోని జిల్లా కోర్టుతో పాటు, జిల్లాలోని అన్ని కోర్టులలో క్లాస్–4 ఉద్యోగుల కోసం బెల్ట్‌లు, బ్యాడ్జీలు సరఫరా చేసేందుకు ఆసక్తిగల సరఫరాదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సరఫరా రంగంలో అనుభవం ఉన్నవారు ఈనెల 20న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తుల సీల్డు కొటేషన్‌లను కడపలోని జిల్లా ప్రధానన్యాయమూర్తి కార్యాలయంలో లేదా డీజేసీయూడీ అట్‌దిరేటాఫ్ ఎన్‌ఐసీ డాట్‌ఇన్ ద్వారా సమర్పించాలన్నారు.

మహిమాన్వితం.. మహాప్రసాదం


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న మఠాధిపతి వీరశివకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం : 'జగన్మాతా.. దీవించు తల్లీ' అంటూ భక్తులు వేడుకున్నారు. మహాదేవి ప్రసాదం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. 'అమ్మవారి ప్రసాదం.. మహిమాన్వితం' అంటూ వారు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈశ్వరీదేవి మఠంలో ఆరు రోజులపాటు కనులపండువగా నిర్వహించిన ఆరాధన గురుపూజ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. అమ్మవారికి మఠాధిపతి వీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేసి, విశేషంగా అలంకరించారు. అనంతరం మహాప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మంగారిమఠం, ఈశ్వరీదేవి మఠం సంప్రదాయాల ప్రకారం వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ద్వార పూజ చేశారు. బ్రహ్మంగారిమఠంలో ప్రసాదం తయారు చేసి, వీరబ్రహ్మేంద్రస్వామికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే ఈశ్వరీదేవి మఠంలో ద్వార పూజ చేశారు. ప్రసాదాన్ని మఠంలో రాశిగా పోసి భక్తులకు పంపిణీ చేశారు. ఈ ప్రసాదం దక్కడం తమ భాగ్యమని వారు ఆనంద భరితులయ్యారు. మఠాధిపతి వీరశివకుమార స్వామి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన సమయాల్లో ఈశ్వరీదేవి స్వయంగా ప్రసాదం తయారు చేసి, భక్తులకు పంపిణీ చేసేవారని పేర్కొన్నారు. అలాగే అమ్మవారు దేశ పర్యటన సందర్భాల్లో పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి, సంకటితిమ్మాయపల్లెకు చెందిన పోలు ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి, ముక్కమల్ల భాస్కర్ రెడ్డి, వీరపు ఉమాపతి, సుంకు సురేష్, వడ్లమాని జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఇబ్రహీంను లక్ష్యంగా చేసుకోవడం తగదు

కడప అర్బన్: ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ ఇబ్రహీంను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి జి.వి ప్రవీణ్‌కుమార్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం తగదని పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్‌తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, అసోసియేషన్ సభ్యుడు, ఆర్‌ఎస్‌ఐ స్వామిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రఘునాథ్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. పోలీసు అధికారులు చట్టానికి లోబడి విధులు నిర్వహిస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అవాస్తవాలతో వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ అధికారులపై రాజకీయ ప్రయోజనాల కోసం బురదచల్లడం మానుకోవాలని సూచించారు. చట్టం అందరికీ సమానమేనని, సమాజంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదన్న సత్యాన్ని ప్రవీణ్‌కుమార్ రెడ్డి గుర్తించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

లింగాల : లింగాల పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అనంతపురం జిల్లా బుక్కాపురం గ్రామానికి చెందిన మదన్‌మోహన్(47) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లింగాల నుంచి పులివెందుల వైపు అరటి కాయల లోడుతో లారీ వస్తుండగా.. పులివెందుల నుంచి మదన్‌మోహన్ ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మదన్‌మోహన్ తలకు తీవ్ర గాయాలు కాగా.. అలాగే అతనికి కాలువిరిగింది. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించాలని వైద్యులు సూచించారన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు.